sahanamvande.com

epaper.sahanamvande.com

సహనం వందే

హైదరాబాద్ | 20-08-2026 గురువారం | సంపుటి-02 సంచిక : 133 EDITOR: ROHINI



అమ్మపై సుప్రీంకోర్టు అనుమానం

బిడ్డకు తండ్రి ఎవరో డీఎన్ఏ చెప్పాల్సిందేనట



భార్యాభర్తల బంధంలో అనుమానం చిచ్చుపెట్టినప్పుడు, కన్నకొడుకుపై తండ్రికి కలుగుతున్న సందేహాన్ని నివారించడానికి కోర్టులు డీఎన్ఏ పరీక్షకు ఆదేశించవచ్చని సుప్రీంకోర్టు స్పష్టం చేసింది. భార్య శీలంపై అనుమానంతో భర్త విడాకులు కోరినప్పుడు, ఆ సత్యాన్ని నిరూపించుకునే హక్కు అతనికి ఉంటుందని అత్యున్నత న్యాయస్థానం తేల్చిచెప్పింది. - సహనం వందే, న్యూఢిల్లీ

- దేశ సర్వోన్నత న్యాయస్థానం సంచలన తీర్పు
- భార్యాభర్తల మధ్య నమ్మకం చెదిరిన వేళ...
- నిజం తేల్చేందుకు డీఎన్ఏ పరీక్ష చేయాలి
- విడాకుల కేసుల్లో శాస్త్రీయ ఆధారాలు కీలకం

పెళ్లయ్యాక సాగే కాపురంలో నమ్మకమే ప్రధానం. కానీ అదే నమ్మకం సడలి, అనుమానం పెరిగితే ఆ బంధం ఏ దారికి చేరుకుంటుందో చెప్పడం కష్టం. సరిగ్గా అలాంటి ఒక సున్నితమైన కుటుంబ వివాదమే ఇప్పుడు దేశవ్యాప్తంగా చర్చనీయాంశమైంది. ఒక భర్త తన భార్య ప్రవర్తనపై తీవ్రమైన ఆరోపణలు చేస్తూ కోర్టును ఆశ్రయించాడు. తనకు పుట్టిన పిల్లవాడు తన సొంత రక్త సంబంధం కాదని, తాను అసలు తండ్రి కాదంటూ ఆయన గట్టిగా వాదించాడు. ఈ నేపథ్యంలో అసలు నిజం బయటపడాలంటే డీఎన్ఏ పరీక్ష ఒక్కటే మార్గమని ఆయన కోర్టును కోరాడు.

ప్రైవేట్ ల్యాబ్ రిపోర్ట్ కలకలం

కోర్టు విచారణలో భాగంగా ఆ భర్త ఒక కీలకమైన ఆధారాన్ని ముందుంచాడు. తాను స్వయంగా హైదరాబాద్‌లోని ఒక ప్రైవేట్ ల్యాబ్‌లో డీఎన్ఏ పరీక్ష చేయించుకున్నానని, ఆ రిపోర్టు ప్రకారం ఆ బాలుడికి తండ్రి కాదని తేలిందని అతను కోర్టుకు తెలిపాడు. ఈ ప్రాథమిక ఆధారంతోనే అతను తన భార్యపై విడాకుల పిటిషన్ దాఖలు చేశాడు. కేవలం ప్రైవేట్ టెస్ట్ సరిపోదని, కోర్టు అధికారికంగా ఒక పితృత్వ పరీక్షకు ఆదేశించాలని అతను కోరగా, బాంబే హైకోర్టు, పూణే ఫ్యామిలీ కోర్టులు కూడా



అతడి వాదనతో ఏకీభవించాయి.

భార్య వ్యతిరేకత...

అయితే ఈ నిర్ణయాన్ని వ్యతిరేకిస్తూ ఆ మహిళ నేరుగా సుప్రీంకోర్టును ఆశ్రయించింది. బలవంతంగా డీఎన్ఏ టెస్టు చేయకూడదనేది చట్టపరమైన సూత్రమని ఆమె వాదించింది. ఎలాంటి పితృత్వ పరీక్షలు లేకుండానే తన విడాకుల పిటిషన్‌పై కోర్టు నిర్ణయం తీసుకోవాలని కోరింది. ఒక తల్లిగా తన వ్యక్తిగత గౌరవానికి, అలాగే తన బిడ్డ ప్రైవసీకి ఈ పరీక్ష భంగం కలిగిస్తుందని ఆమె గట్టిగా వాదించింది. పూణే ఫ్యామిలీ కోర్టు నుండి బాంబే హైకోర్టు వరకు ఆమె ఈ డీఎన్ఏ పరీక్షలను అడ్డుకోవడానికి ఎన్నో ప్రయత్నాలు చేసింది.

సుప్రీంకోర్టు సూటి ప్రశ్న

ఈ పిటిషన్‌ను విచారించిన జస్టిస్ ఎం.ఎం. సుందరేష్, జస్టిస్ ప్రసన్న బి. వరాలేతో కూడిన సుప్రీంకోర్టు ధర్మాసనం మహిళ తరపు న్యాయవాది వాదనలను తోసిపుచ్చింది. ఒకవేళ నువ్వు మంచి దానివైతే, నీ మీద నీకు నమ్మకం ఉంటే ఈ డీఎన్ఏ టెస్ట్‌కి ఎందుకు అభ్యంతరం చెబుతున్నావంటూ సూటిగా ప్రశ్నించింది. భర్త చేసిన ఆరోపణలను రుజువు చేసుకోవడానికి కేవలం మాటలు సరిపోవని, శాస్త్రీయ ఆధారాలు అత్యంత అవసరమని కోర్టు భావించింది. భర్త తన పిటిషన్‌లో ప్రధాన ఆధారంగా భార్య అనైతికతను తప్పుపట్టాడని, అటువంటి తీవ్రమైన ఆరోపణలు వచ్చినప్పుడు కేవలం డీఎన్ఏ రిపోర్టు ద్వారా మాత్రమే నిజానిజాలు బయటపడతాయని స్పష్టం చేసింది.

నిజాల నిగ్గు తేల్చే శాస్త్రీయ మార్గం

ఈ కేసులో అత్యున్నత న్యాయస్థానం రెండు ముఖ్యమైన అంశాలను ప్రాతిపదికగా తీసుకుంది. మొదటిది భర్త తన వాదనను నిరూపించడానికి తగిన ప్రాథమిక ఆధారాలను రికార్డులో ఉంచడం. రెండోది ఆ వివాహ సంబంధాన్ని తేల్చడానికి ఈ పితృత్వ పరీక్ష అవసరమా కాదా అనేది పరిశీలించడం. హైదరాబాద్ ల్యాబ్ ఇచ్చిన నివేదిక ప్రకారం తండ్రి కాదని అని తేలినందున, ఈ కేసులో డీఎన్ఏ పరీక్ష నిర్వహించడం అత్యంత సమంజసమని న్యాయస్థానం నిర్ధారించింది. బాంబే హైకోర్టు, పూణే ఫ్యామిలీ కోర్టులు ఇచ్చిన ఆదేశాలు పూర్తిగా చట్టబద్ధమైనవేనని సుప్రీంకోర్టు స్పష్టం చేసింది.

నమ్మకం సడలిన వేళ చట్టం తీర్పు

ఈ తీర్పు భవిష్యత్తులో దేశంలోని అనేక కుటుంబ వివాహాలపై, విడాకుల కేసులపై తీవ్రమైన ప్రభావం చూపే అవకాశం ఉంది. ఒకవైపు మహిళల హక్కులు, వ్యక్తిగత గోప్యత గురించి మాట్లాడుతున్నప్పటికీ... మరోవైపు పురుషులు తమపై వచ్చే నిరాధారమైన లేదా తీవ్రమైన ఆరోపణలను శాస్త్రీయంగా నిరూపించుకునే మార్గాన్ని ఈ తీర్పు సుగమం చేసింది. వివాహ బంధంలో నిజాయితీ ఎంత ముఖ్యమో, అనుమానాలు తలెత్తినప్పుడు చట్టం ద్వారా వాటిని నిగ్గుతేల్చడం కూడా అంతే అవసరమని ఈ ఉదంతం నిరూపిస్తోంది. సత్యం నిరూపణ కావడానికి శాస్త్రీయ పరీక్షలు అత్యంత అవసరమని సుప్రీంకోర్టు మరోసారి నిరూపించింది.

హోదా చూసి వల

లైకులే అసలు కరెన్సీ

- జాబ్ టైటిలే పెద్ద అర్హత
- వ్యాపారంగా మారిన బంధాలు
- మోసపోయే ప్రేమ ప్రయాణం

ప్రేమ పేరిట ఇప్పుడు డిజిటల్ లో జరుగుతున్న సరికొత్త మోసం బట్టబయలైంది. ఎదుటి మనిషిని మనసుతో ఇష్టపడకుండా వారి వెనుక ఉన్న హోదాను, ఇన్‌స్టాగ్రామ్ ఫాలోయింగ్‌ను చూసి అతుక్కుపోతున్న విచిత్రమైన ట్రెండ్ డేటింగ్ ప్రపంచాన్ని కమ్మేసింది. దీనినే థ్రోనింగ్ అని పిలుస్తున్నారు. సినిమా కథలా బయటకు గ్లామర్‌గా కనిపించే ఈ రిలేషన్‌షిప్‌ల వెనుక అసలు నిజం వేరే ఉంటుంది. ఇక్కడ నిజమైన ప్రేమ కంటే యాక్సెప్, అటెన్షన్, సోషల్ మీడియాలో వచ్చే లైక్సే అసలైన కరెన్సీలా మారిపోయాయి. - సహనం వందే, హైదరాబాద్



ఎవరైనా మనతో డేటింగ్ చేయడం వెనుక కేవలం మన వ్యక్తిత్వం మీద ఉన్న అభిమానం కాకుండా మన సోషల్ స్టేటస్ ఉంటే దాన్ని క్లౌట్-చాసింగ్ లేదా థ్రోనింగ్ అంటారు. ఈ తరహా సంబంధాలు పూర్తిగా ఒక వ్యాపారం లాగా మారిపోతాయి. అవతలి వ్యక్తికి మీరు ముఖ్యం కాదు. మీ ద్వారా వాళ్లకు దొరికే గుర్తింపు, విజిబిలిటీ, పబ్లిక్ సర్కిల్ మాత్రమే ముఖ్యం. సోషల్ మీడియా వచ్చాక ఈ రకమైన ప్రవర్తన మరింత ఎక్కువైపోయింది.

జాబ్ టైటిలే పెద్ద అర్హత

మీ రిలేషన్‌షిప్‌లో నిజంగానే డెప్త్ ఉందా లేదా అనేది తెలియాలంటే ముందు ఎదుటి వ్యక్తి మిమ్మల్ని నలుగురిలో ఎలా పరిచయం చేస్తున్నారో గమనించాలి. ఎప్పుడైనా మిమ్మల్ని మీ పేరు పెట్టి మీ వ్యక్తిత్వాన్ని పరిచయం చేయకుండా మీ జాబ్ టైటిల్, మీకున్న పెద్ద కనెక్షన్లు లేదా మీ అచీవ్‌మెంట్స్‌ని మాత్రమే హైలైట్ చేస్తూ మాట్లాడితే అక్కడ ప్రమాద ఘంటలు మోగినట్లే. నిజంగా ఇష్టపడే వాళ్ళు మీ మనసు గురించి, మీ అలవాట్ల గురించి తెలుసుకోవడానికి ఆసక్తి చూపుతారు. కానీ ఈ థ్రోనింగ్ చేసేవాళ్ళు మాత్రం మిమ్మల్ని కేవలం నలుగురిలో గొప్పగా చెప్పుకోవడానికి లేదా వేరే వాళ్లతో పరిచయాలు పెంచుకోవడానికి ఒక మెట్టులా మాత్రమే వాడుకుంటారు.

కెమెరా ముందు మాత్రమే ప్రేమ

పబ్లిక్‌లో చూపించే ప్రేమకు ప్రైవేట్‌లో చూపించే శ్రద్ధకు మధ్య పొంతన లేకపోతే అది కచ్చితంగా పెద్ద రెడ్ ఫ్లాగ్‌గా భావించాలి. నలుగురు చూస్తున్నప్పుడు మీతో దిగిన ఫోటోలను ఇన్‌స్టాగ్రామ్‌లో పెట్టి రకరకాల స్టోరీలు వేసి హంగామా చేసే వాళ్ళే... ఎవరూ లేని సమయంలో ముఖం చాటేస్తే అర్థం చేసుకోవాలి. సాధారణ సమయాల్లో వాళ్ళ నుంచి అసలు స్పందనే ఉండదు. కేవలం ఆడియెన్స్ ఉన్నప్పుడే వాళ్ళలో ప్రేమ ఉప్పొంగుతుంది.

హోదా తగ్గితే ముఖం చాటింపు

ఒకరితో ప్రేమగా ఉండటం వేరు, వారిని చూసి గర్వపడటం వేరు. కానీ మీ విలువ పూర్తిగా మీ దగ్గర ఉన్న ఆస్తులు, హోదా లేదా ఇమేజ్ మీద మాత్రమే ఆధారపడి ఉంటే అది కచ్చితంగా ప్రమాదకరమే. మీరు సమాజంలో ఒక మంచి పొజిషన్‌లో ఉన్నంత వరకే మీతో అంటకాగి ఆ హోదా తగ్గగానే ముఖం చాటేసే పరిస్థితి వస్తే దాన్ని వాడుకోవడం అంటారు. ఇలాంటి చోట మన విలువ క్రమంగా తగ్గిపోతుంది.

బంధం ముసుగులు

థ్రోనింగ్ బారిన పడిన వ్యక్తులు కేవలం మోసపోయామనే భావనతో ఆగిపోకుండా దీర్ఘకాలంలో మానసికంగా చాలా నష్టపోతారు. ఎప్పుడూ ఎవరో ఒకరి అంచనాలకు తగట్టు బతకాల్సి రావడం, కేవలం తమ హోదా కోసమే ఎదుటి వ్యక్తి తనతో ఉంటున్నాడనే నిజం తెలిసినప్పుడు కలిగే వేదన చాలా తీవ్రంగా ఉంటుంది. ఇది మనుషుల మీద ఉన్న నమ్మకాన్ని పూర్తిగా దెబ్బతీస్తుంది. భవిష్యత్తులో నిజమైన సంబంధాలను ఏర్పరచుకోకుండా అడ్డుకుంటుంది.

ఢిల్లీలో లాయర్ల రచ్చ

బార్ కౌన్సిల్ ఛైర్మన్ రాజీనామాకు డిమాండ్

భారతీయ న్యాయ వ్యవస్థను శాసించాల్సిన అత్యున్నత సంస్థ అధిపతిపై ఇప్పుడు తీవ్రస్థాయిలో తిరుగుబాటు మొదలైంది. న్యాయవాదుల సంక్షేమాన్ని గాలికొదిలేసి కేవలం రాజకీయ అజెండాల కోసం పదవిని దుర్వినియోగం చేస్తున్నారంటూ బార్ కౌన్సిల్ ఆఫ్ ఇండియా ఛైర్మన్‌పై లాయర్లు బహిరంగంగానే యుద్ధం ప్రకటించారు. ఢిల్లీలోని ప్రధాన కార్యాలయం వెలుపల జరుగుతున్న ఈ నిరసనలు దేశవ్యాప్తంగా సంచలనం సృష్టిస్తున్నాయి. - సహనం వందే, న్యూఢిల్లీ

- నల్సార్ వర్సిటీ విద్యార్థులపై వేటుపై ఆగ్రహం
- యువ లాయర్ల సంక్షేమం ఏమైందని నిలదీత

ఢిల్లీలోని బార్ కౌన్సిల్ ఆఫ్ ఇండియా కార్యాలయం ఎదుట లాయర్లు పెద్ద ఎత్తున ఆందోళనకు దిగారు. బీసీఐ ఛైర్మన్ మనన్ కుమార్ మిశ్రా వెంటనే తన పదవికి రాజీనామా చేయాలని డిమాండ్ చేస్తూ ప్లకార్డులతో నినాదాలు చేశారు. గురువారం ఆల్ ఇండియా యంగ్ అడ్వకేట్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో లాయర్లు ఆందోళనకు దిగారు. ఈ ఆందోళనకు కాక్రోచ్ జనతా పార్టీ మద్దతు తెలిపినప్పటికీ ఇది పూర్తిగా లాయర్ల స్వచ్ఛంద ఉద్యమమని నిరసనకారులు స్పష్టం చేశారు.

విద్యార్థులపై వేటు...

ఇది ఇటీవల నల్సార్ యూనివర్సిటీ వివాదం నుంచి ముదురుకుంది. హైదరాబాద్‌లోని ప్రముఖ లా విశ్వవిద్యాలయానికి చెందిన 2026 గ్రాడ్యుయేటింగ్ బ్యాచ్ విద్యార్థుల ఎన్‌రోల్‌మెంట్‌ను నిలిపివేయాలని బార్ కౌన్సిల్ జారీ చేసిన ఆదేశాలే ఈ వివాదానికి అసలు సిసలు కారణం. విద్యార్థుల నిరసన హక్కును కాలరాసేలా వ్యవహరించిన తీరుపై సర్వత్రా విమర్శలు వెల్లువెత్తాయి.

ప్రధాన న్యాయమూర్తి ఆగ్రహం

ఈ ఏకపక్ష నిర్ణయంపై తీవ్ర వ్యతిరేకత రావడంతో బార్ కౌన్సిల్ దిగివచ్చి ఆ ఉత్తర్వులను వెనక్కి తీసుకుంది. చాలా మంది విద్యార్థులు నిర్దోషులని అప్పట్లో ప్రకటించింది. ఈ మొత్తం ఘటనపై స్పందించిన సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సూర్యకాంత్ ఈ ఉత్తర్వులు పూర్తిగా అనవసరమని తేల్చిచెప్పారు. విద్యార్థులకు నిరసన తెలిపే హక్కు ఉంటుందని స్పష్టం చేస్తూ ఎవరిపై కూడా ఎలాంటి శిక్షాత్మక చర్యలు ఉండకూడదని తేల్చి చెప్పారు.

పదవిలో పద్నాలుగేళ్లా?

ఈ నేపథ్యంలో నిరసనలో పాల్గొన్న లాయర్లు ఛైర్మన్ సుదీర్ఘ పదవీకాలంపై నిప్పులు చెరిగారు. గత 14 సంవత్సరాలుగా పదవిలో కొనసాగుతున్న ఛైర్మన్ న్యాయవాదుల సంక్షేమం కోసం ఇప్పటివరకు చేసిందేమిటని నిలదీశారు. అపెక్స్ బాడీ అధికారిక లేఖలను సైతం దుర్వినియోగం చేస్తూ వ్యక్తిగత రాజకీయ అజెండాలను ముందుకు తీసుకువెళ్తున్నారని మండిపడ్డారు.

రక్షణ లేని వృత్తి

దేశంలో రోజురోజుకు న్యాయవాదులపై దాడులు పెరిగిపోతున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. పోలీస్ స్టేషన్లలోనే లాయర్లు హత్యకు గురవుతున్నారని, ఇటీవల హైదరాబాద్‌లో ఒక సీనియర్ లాయర్ మృతి చెందితే కనీసం అధికారిక ప్రకటన కూడా చేయలేదని ఆవేదన వ్యక్తం చేశారు. లాయర్ల సంక్షేమం గురించి మాట్లాడకుండా కేవలం మౌనం వహిస్తున్నారని తీవ్ర స్థాయిలో ధ్వజమెత్తారు.

సంస్థాగత లోపాలపై నిలదీత

వృత్తిపరమైన హక్కులు, అడ్వకేట్స్ యాక్ట్ అమలు, యువ లాయర్లకు స్టైఫండ్లు, చాంబర్ల కేటాయింపు వంటి అనేక సమస్యలు అలాగే పేరుకుపోయాయని నిరసనకారులు వాపోయారు. దేశంలో 35 శాతం నుంచి 40 శాతం వరకు నకిలీ లాయర్లు చలామణి అవుతున్నప్పటికీ నకిలీ లా కాలేజీలను, సర్టిఫికెట్లను అరికట్టడంలో బార్ కౌన్సిల్ పూర్తిగా విఫలమైందని ఆరోపించారు.